# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ విశాఖపట్నం పోర్ట్ దేశ ఆర్థికాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందని కేంద్ర మంత్రి సర్బానంద్ సోనోవాల్ పేర్కొన్నారు.
- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఏపీ ఫైబర్‌నెట్, ఎక్సైజ్ శాఖలపై సమీక్ష నిర్వహించారు.
- ❖ గోవా రాష్ట్ర గవర్నర్ గా మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు నియమితులయ్యారు.
- ❖ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడవ టెస్ట్ మ్యాచ్ లో భారత విజయానికి ఇంకా 81 పరుగులు చేయాల్సి ఉంది.

==========================

విశాఖపట్నం పోర్ట్ దేశ ఆర్థికాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందని కేంద్ర ఓడరేవులు, జల రవాణా శాఖా మంత్రి సర్బానంద్ సోనోవాల్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా ఈరోజు ఆయన విశాఖపట్నం పోర్ట్ ను సందర్శించి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మెర్కంటైల్ మెరైన్ డిపార్ట్మెంట్ లకు సంబంధించి 320 కోట్ల రూపాయల విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టులకు శంఖుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ... విశాఖపట్నం పోర్ట్ గత 92 సంవత్సరాలుగా విశేషంగా సేవలందిస్తోందని.. దేశంలోనే కాకుండా కంటైనర్ పోర్ట్ పెర్ఫార్మెంస్ నివేదికల్లో ప్రపంచంలోనే 19వ స్థానం దక్కించుకుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 82.62 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో సేవలు నిర్వహించిందని తెలిపారు. 2023లో ప్రారంభించిన క్రూజ్ టెర్మినల్ ద్వారా 2000 మందికి ప్రయాణికులకు సేవలందిస్తూ.. తీర ప్రాంత పర్యాటకాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఈరోజు శంఖుస్థాపన చేసిన అత్యాధునిక మౌలిక సదుపాయాలతో విశాఖపట్నం ఓడరేవు ప్రపంచంలోనే అగ్రగామిగా పురోగతి సాధించాలని కేంద్ర మంత్రి ఆకాంక్షిస్తూ..

(వాయిస్ 27 సెకన్లు)

అంతకుముందు సముద్రయాన రంగానికి సంబంధించి బంగాళాఖాతం ప్రాంతంలో పరస్పర సహకారం కోసం నిర్దేశించిన 'బిమ్స్ టెక్' పోర్టు కాన్‌క్లైవ్ రెండవ ఎడిషన్ ను ఆయన ప్రారంభించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా

సముద్రయాన శ్రామిక శక్తి కోసం నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటూ.. ఆ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను సైతం భారత్ ప్రోత్సహిస్తోందని సర్బానంద్ సోనోవాల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఎక్సైజ్ శాఖపై రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ స్థితిగతులపై అధికారులతో చర్చించారు. అంతకుముందు ఏపి ఫైబర్ నెట్‌పై కూడా సమీక్ష చేపట్టారు. నూతన విధానాలు అమలు చేసి.. కనెక్షన్లు పెంచేలా అధికారులు కృషి చేయాలన్నారు. భారత్ నెట్ కార్యక్రమంతో ఫైబర్ నెట్ అనుసంధానానికి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు.

==========================

గోవా రాష్ట్ర గవర్నర్ గా మాజీ కేంద్ర మంత్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పూసపాటి అశోక్‌గజపతిరాజు నియమితులయ్యారు. అదే విధంగా హరియాణా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషిమ్‌కుమార్ ఘోష్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాను నియమిస్తూ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం అసెంబ్లీ నియోజక వర్గం నుంచి వరుసగా ఆరు సార్లు శాసన సభ్యునిగానూ.. ఒకసారి ఎంపీగా అశోక్ గజపతిరాజు విజయం సాధించారు. 2014లో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వంలో పౌరవిమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఇక అశోక్‌గజపతిరాజు గవర్నర్‌గా నియామకం అవడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

==========================

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చిన పీ-4 కార్యక్రమానికి సంబంధించి మార్గదర్శిల గుర్తింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పీ-4కి మార్గదర్శులుగా ఎంపిక కావడం వలన సంక్షేమ పథకాలపై ఎలాంటి ప్రభావం ఉండదని... జిల్లాలో ఔత్సాహికులను గుర్తించి బంగారు కటుంబాలకు అనుసంధానించాలని సూచించారు. 10 వేల మంది మార్గదర్శులను గుర్తించాలని అధికారులకు నిర్దేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో పీ-4 కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. పేదరికం లేని సమాజ నిర్మాణంలో అధికారులు కూడా భాగస్వామ్యం కావాలన్నారు.

==========================

“ప్రధానమంత్రి జన్ మన్ పథకం” ద్వారా మంజూరైన పనులను సెప్టెంబర్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభూ నాయర్ అధికారులను ఆదేశించారు. పీఎం జన్ మన్, ఆది కర్మయోగి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 2026 తరువాత పీఎం జన్ మన్ పనులకు నిధులు అందుబాటులో వుండనందున పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆది కర్మయోగి పథకం కింద సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. అధికారులు ప్రతి గ్రామాన్ని వారంలో కనీసం రెండు సార్లు సందర్శించి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. సమస్యలు పరిష్కారానికి సింగిల్ విండో విధానం అవలంబించాలని విభూ నాయర్ సూచించారు.

విరామం

==========================

ఉత్తరాంధ్రలోని గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగుని అరికట్టామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ప్రస్తుతం అరకు అంటే కాఫీ గుర్తొచ్చేవిధంగా పరిస్థితిని మార్చామన్నారు. అమరావతిలో ఈరోజు ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ. అరకును కాఫీ బ్రాండ్‌గా తీర్చిదిద్దామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, ఈగల్ టీమ్ కలిసి పనిచేసి ఈ మార్పును తీసుకొచ్చాయని మంత్రి పేర్కొంటూ......

(వాయిస్ 31 సెకన్లు)

==========================

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాల్గవ సీజన్ కోసం క్రికెటర్ల వేలం ప్రక్రియ విశాఖపట్నంలో కొనసాగుతోంది. ఈ సీజన్ కోసం దాదాపు 500 మంది క్రికెటర్లు వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. మొత్తం ఏడు జట్లు ఈ వేలంలో ప్లేయర్ల కోసం పోటీపడుతున్నాయి.

==========================

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపీపీఎస్సి) పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విజయనగరం జిల్లా సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ అధికారులకు సూచించారు. అధ్యాపకుల ఉద్యోగాల భర్తీకి నిర్వహిస్తున్న పోటీ పరీక్షల ఏర్పాట్లపై సంబందిత శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎపిపిఎస్సి ద్వారా లెక్చరర్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం జిల్లాలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు.

==========================

అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడవ టెస్ట్ మ్యాచ్ లో భారత విజయానికి ఇంకా 81 పరుగులు చేయాల్సి ఉంది. చివరి రోజు అయిన ఈరోజు ఆట ప్రారంభించిన భారత్ భోజన విరామ సమయానికి 8 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ విజయానికి మరో రెండు వికెట్లు తీయాల్సి ఉంది.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,500 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. చివరికి 247 పాయింట్ల నష్టంతో 82,253 వద్ద ముగిసింది. నిఫ్టీ 67.55 పాయింట్ల నష్టంతో 25,082 పాయింట్ల వద్ద స్థిరపడింది.

==========================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ అధికారి వెల్లడిస్తూ....

(వాయిస్ 24 సెకన్లు)

==========================
==========================